సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రవీంద్ర

పర్యాటక ప్రాంతాల అభివృద్ధితో గ్రామాల ఆర్థిక వృద్ధి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- హిరమండలం

పర్యాటక ప్రాంతాలు అభివృద్ధి చేయడం ద్వారా సమీప గ్రామాల అభివృద్ధి, గ్రామీణ కుటుంబాలకు ఆదాయం పెరగడం సాధ్యమవుతుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. మండలంలోని లోకొండ పంచాయతీ పరిధిలోని పూలకొండ, గుడియాపాడు, వంశధార రిజర్వాయరు, ఉద్దానం తాగునీటి ప్రాజెక్టు పరిసరాలను పరిశీలించారు. పరిశీలించారు. స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పడాల భూదేవి, డాక్టర్ పొతురాజు శ్రీధర్‌ల సారథ్యంలో కలెక్టర్ పూలకొండ ప్రాంతాన్ని పర్యాటక స్థలంగా మార్చే అవకాశం ఉందా? అనే దానిపై సవివరంగా పరిశీలించారు. నీటి వనరులు, సుందరమైన ప్రకృతి దృశ్యాలు, పర్యాటకులను ఆకర్షించే ప్రదేశాలను ఎలా అభివృద్ధి చేయాలో అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. శ్రీముఖలింగం, శ్రీకూర్మం, వంశధార రిజర్వాయరు వంటి ఇప్పటికే ఉన్న పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. పూలకొండలో మౌలిక వసతులు కల్పిస్తే పర్యాటకులకు మరింత అనుకూలంగా ఉంటుందని అన్నారు. గిరిజనుల సాంప్రదాయ వంటకాలను, స్థానిక పంటలను పర్యాటకుల ముందుకు తీసుకురావడం ద్వారా వారి ఆదాయం పెరగవచ్చని సూచించారు. గుడియాపాడు పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సౌకర్యాలు, ఇటీవల ప్రభుత్వం అందజేసిన కిట్లను పరిశీలించారు. అలాగే వైద్య, రవాణా సదుపాయాలపై గిరిజనుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. గిరిజనులు ఈ ఏడాది ఇప్పటివరకు దోమతెరలు పంపిణీ చేయలేదని, కొంతమంది రైతులకు పోడు పట్టాలు అందలేదని, గుడియాపాడులోని నేల బావి మరమ్మతు చేయలేదని, రహదారి సౌకర్యం దయనీయంగా ఉందని, విద్యుత్ సమస్యలు ఉన్నాయని ఫిర్యాదు చేశారు. వీటిని త్వరగా పరిష్కరించేందుకు స్థానిక అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. అనంతరం గోడియాపాడు సమీపంలోని హిల్ స్పాట్‌ను పరిశీలించారు. ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తే గిరిజన యువతకు పర్యాటక రంగంలో శిక్షణ ఇవ్వడం ద్వారా వారి ఆర్థిక స్థితి మెరుగుపడుతుంది అన్నారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ పృథ్వీరాజ్ కుమార్, తహశీల్దార్ హనుమంతరావు, ఎంపిడిఒ కాశీప్రసాద్, ఎపిఒ శ్రీనివాస్, ఎపిం సాయిలక్ష్మి, డిప్యూటీ ఎంపిడిఒ గోవిందరావు పాల్గొన్నారు.

విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

చిన్నోడి తెలివి... మురిసిన కలెక్టర్

కలెక్టర్ పర్యటనలో మానవీయ హృదయాన్ని వ్యక్తం చేశారు. గొడియాపాడులో రెండో తరగతి చదువుతున్న బిడ్డిక శామ్యూల్ అనే చిన్నారిని చూసి ఆగి, కొంతసేపు అతనితో ముచ్చటించారు. 'ఎలా చదువుకుంటున్నావు? భవిష్యత్‌లో ఏమవ్వాలనుకుంటున్నావు?' అని ప్రశ్నలు వేశారు. అతని అమాయక సమాధానాలు విని కలెక్టర్ హర్షం వ్యక్తం చేశారు. స్టూడెంట్ కిట్ ధరించి ఉన్న శామ్యూల్ తన తల్లిదండ్రుల గురించి, తన చిన్ననాటి కలల గురించి నిరాడంబరంగా చెప్పిన విధానం కలెక్టర్‌ను ఆకట్టుకుంది. తాను రెండో తరగతిలో నేర్చుకున్న పాఠ్యాంశాలపై కొన్ని ప్రశ్నలు అడిగితే, శామ్యూల్ ధైర్యంగా సమాధానాలు చెప్పాడు. అతని తెలివితేటలు చూసి కలెక్టర్ చిరునవ్వులు చిందించారు. 'బాగా చదివి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకో' అని ఆశీర్వదిస్తూ, కలెక్టర్ అతన్ని ఒక బైక్‌పై కూర్చోబెట్టి ప్రేమగా చేర్చుకున్నారు. ఈ సన్నివేశాన్ని చూసిన స్థానికులు కలెక్టర్‌లోని మానవీయతను ప్రశంసించారు.

మత్స్యకారులకు టిడిపి అండ

ఎక్సైజ్‌శాఖ మంత్రి రవీంద్ర

ప్రజాశక్తి- సోంపేట, రణస్థలం రూరల్, కోటబొమ్మాళి

మత్స్యకారులకు డీజిల్‌పై సబ్సిడీ ఇచ్చింది తెలుగుదేశం పార్టీ హయాంలోనేనని, వారి సంక్షేమానికి అనేక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని భూగర్భ గనులు, ఎక్సైజ్‌శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మండలంలో ఎకువూరులో శనివారం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నాయుడు అహర్నిశలు అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తున్నారని అన్నారు. రాష్ట్రాన్ని అధోగతి పాలు చేయడానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ కుతంత్ర రాజకీయాలు అనని విమర్శించారు. స్వాతంత్ర్య సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న పుట్టిన ప్రాంతంలో తాను పాల్గొని మాట్లాడడం ఆనందంగా ఉందన్నారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆధ్వర్యాన నియోజవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో 64 లక్షల మందికి పింఛన్లు ఇస్తుందని అన్నారు. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు సదుపాయం కల్పిస్తున్నారని అన్నారు. విప్ మాట్లాడుతూ ఇంటింటికీ వచ్చి ప్రజల సమస్యలు తెలుసుకునేందుకే సుపరిపాల పేరుతో సిఎ చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని తెలిపారు. టిడిపి హయాంలోనే మత్స్యకార గ్రామాలకు వెలుగులు వచ్చాయని అన్నారు. జనసేన నియోజకవర్గ సమన్వయకర్త దాసరి రాజు, టిడిపి రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, నాయకులు మాగుపల్లి పాపారావు వాసుపల్లి కృష్ణారావు, బడే సూరి, జి.కెనాయుడు, మడ్డు రాజారావు మాట్లాడారు. అంతకుముందు రూ.95 లక్షలతో నిర్మించనున్న బీచ్ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బి.అప్పలస్వామి, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సిఐ జి.వి.రమణ, సిఐ బి.మంగరాజు పాల్గొన్నారు.

రణస్థలంలోని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు కార్యాలయాన్ని వెళ్లారు. మంత్రిని ఎమ్మెల్యే సాదరంగా ఆహ్వానించారు. నియోజకవర్గ అభివృద్ధిపై ఆయన కృషి ప్రశంసనీయమని మంత్రి కొనియాడారు.

రాష్ట్ర ఎక్సైజ్‌శాఖామంత్రి కొల్లు రవీంద్ర సోంపేట పర్యటన నిమిత్తం కొత్తపేట కూడటి వద్ద టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్‌లు స్వాగతం పలికారు. దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో అధ్యక్షులు కోరాడ గోవిందరావు, దుక్క లక్ష్మణరావు పాల్గొన్నారు.

డ్రోన్లకు చిక్కితే చర్యలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడి డ్రోన్ కెమెరాకు చిక్కితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి కె.వి.మహేశ్వర రెడ్డి హెచ్చరించారు. నిర్మానుష్యమైన ప్రదేశాల్లో డ్రోన్ నిఘా పెట్టి చట్ట వ్యతిరేక కార్యకలాపాలు అరికట్టే దిశగా శనివారం ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో డచ్ బంగ్లా, కంపోస్టు కాలని, దమ్మవీధి, గుడివీధి, నాగావళి నదీ పరివాహక ప్రాంతాలు, పట్టణ చివర ప్రాంతాల్లో డ్రోన్ కెమెరా వినియోగించారు. పేకాట, బహిరంగంగా మద్యం, గంజాయి సేవించడం, ఈవిటీజింగ్, చైన్ స్నాచింగ్, జూదం వంటి నేరాలపై డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేశారు. పాడుపడిపోయిన బంగ్లాలు, నివాసగృహాలపై డ్రోన్ కెమెరాలతో బహిరంగంగా మద్యం సేవించడం గంజాయి సేవించడం వంటి వారు పట్టుబడితే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఎరువుల కొరత ఉండరాదు

వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి : మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు

రైతులకు ఎరువులు సవృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అధికారులను ఆదేశించారు. మండలంలోని నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో వ్యవసాయశాఖ అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఏ ఒక్క రైతూ 'ఎరువులు అందడం లేదు' అని ఫిర్యాదు చేయకూడదని స్పష్టం చేశారు. రైతు సేవా కేంద్రాల్లో తగినన్ని నిల్వలు ఉండేలా వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శివారు ప్రాంత రైతులకు సాగునీరు అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కాలువల్లో పూడికతీత పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ అధికారులకు ఆదేశించారు. అవసరమైతే తాత్కాలిక సిబ్బందిని నియమించి పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. చెరువుల్లో నీటి నిల్వలను పెంచేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని సూచించారు. తరువాత ప్రజల నుంచి వినతులు స్వీకరించిన మంత్రి అచ్చెన్నాయుడు, వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు సంబంధిత అధికారులకు ఫోన్‌లోనే ఆదేశాలు జారీ చేశారు. సమావేశంలో అధికారులు ఆర్.అప్పారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి శ్రీనివాస్ కాలనీలో రూ.1.17 కోట్లతో సిసి రోడ్లు, ప్రభుత్వం డిగ్రీ కళాశాల ప్రహరీ నిర్మాణానికి వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, ఎంపిడిఒ ఫణీంద్రకుమార్, తహశీల్దార్ ఎం.సత్యం, టిడిపి నాయకులు ఎల్.ఎల్.నాయుడు, కోల కుమార్, పి.అభిలాష్ పాల్గొన్నారు.

కూటమిపై తిరుగుబాటు తప్పదు

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్

ప్రజాశక్తి- సారవకోట

మాట్లాడుతున్న కృష్ణదాస్

ఎన్నికల్లో నమ్మించి మోసం చేసిన చంద్రబాబుపై తిరుగుబాట తప్పదని, ఇప్పటికే గ్రామాల్లో కూటమి ప్రభుత్వాన్ని నిలదీస్తున్నారని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ విమర్శించారు. సారవకోటలో శనివారం నిర్వహించిన బాబు ష్యూరిటీ-మోసం మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రతిసారీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి రావడానికి చంద్రబాబు ఎన్ని అబద్ధపు హామీలైన ఇస్తారని అన్నారు. అధికారంలోకి వచ్చాక ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఎప్పుడు ఇస్తారని కూటమి నాయకులను నిలదీయాలని పిలుపునిచ్చారు. వైసిపి నాయకులు ధర్మాన కృష్ణచైతన్య మాట్లాడుతూ కరోనా లాంటి కష్టకాలంలో మాజీ సిఎం జగన్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు వరుదు వంశీకృష్ణ, డిఎల్‌డిఎ అధ్యక్షులు నక్క తులసీదాస్, జిల్లా కార్యదర్శి యాల శ్యామసుందరరావు, మండల మహిళా అధ్యక్షులు సాధు సుజాతమ్మ పాల్గొన్నారు.

డిమాండ్లు నెరవేర్చాలి

ఆమదాలవలస : అర్ధనగ్న ప్రదర్శన నిర్వహిస్తున్న కార్మికులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ నగరంలో కార్పొరేషన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన వినతిపత్రం అందించారు. మున్సిపల్ కార్మికులు రాష్ట్రవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా శనివారం దయం 5.30 గంటల నుంచి మున్సిపల్ కార్మికులు అందరూ సమ్మెలో పాల్గొని శ్రీకాకుళం నగర పాలక సంస్థ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి ఏడాది గడిచిన ఇచ్చిన హామీలను అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని విమర్శించారు. ఆప్కాస్‌లో ఉన్న మున్సిపల్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులు, పారిశుధ్య కార్మికులకు జిఒ 36 ప్రకారం రూ.26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. కార్మికులందరికీ తల్లికి వందనం, ఫీజురీయంబర్స్‌మెంట్, రేషన్ కార్డులు తదితర సంక్షేమ పథకాలు అమలు చేయాలనాన్రు. విశ్రాంతి, మృతి చెందిన కార్మికుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. గత సమ్మె కాలపు హామీలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షులు అరుగుల గణేష్, ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఎ.మోహన్, ఆర్.యుగంధర్, యుగంధర్, ఎ.శేఖర్ ఎ.రాజశేఖర్, ఎ.జన, డి.చిట్టిబాబు, ఎ.లక్ష్మి, ఆర్.ఈశ్వరమ్మ, ధనలక్ష్మి, పి.మల్లమ్మ, కె.బాలరాజు పాల్గొన్నారు.

ఆమదాలవలస : ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమస్యల పట్ల ఉదాసీనత ప్రదర్శిస్తున్న తీరుకు నిరసనగా మున్సిపల్ కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని మోనింగి వారి వీధిలో ఉన్న మస్టర్ పాయింట్ వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు తాడి సంతోష్ ఆధ్వర్యాన చేపట్టారు. కార్యక్రమంలో ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్‌శాఖ ప్రధాన కార్యదర్శి నీలాపు రాజేష్, జె.శ్రీనివాసరావు, కె.తారకేశ్వరరావు, కె.ధనలక్ష్మి, ఎన్.రమ, కె.ఈశ్వరరావు, కె.నీలమ్మ, ఎ.శ్రీనివాస్, డి.రాజేష్ పాల్గొన్నారు.

పలాస : ప్రభుత్వం జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె ఆగదని మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ నెల 16 నుంచి నిర్వహించిన మున్సిపల్ కార్మికుల సమ్మె శనివారానికి నాలుగో రోజుకు చేరింది. కాశీబుగ్గ సంత మైదానంలో మోకాళ్లపై కూర్చొని నిరసన చేపట్టారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సిహెచ్.మురగన్, కె.వెంకట్, ఎం.రవి, ఎస్.శంకర్, ఎస్.భాస్కరరావు, కూర్మారావు, బాలకృష్ణ, ప్రకాష్‌ముఖి, గులాబీ, పార్వతి, నాని శకుంతల పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించే వరకూ సమ్మె కొనసాగిస్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు రమేష్ కుమార్ పట్నాయక్ అన్నారు. సమ్మె మూడో రోజు మెయిన్ రోడ్డుపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చి ఏడాది పూర్తయినా ఇచ్చిన హామీలు అమలు చేయడంలో జాప్యం చేయడం దారుణమన్నారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, డి.ఢిల్లి, గంగాధర్‌రాథో, మంగలసత్తు తదితరులు పాల్గొన్నారు.

పలాస : మోకాళ్లపై కూర్చొని నిరసన తెలుపుతున్న కార్మికులు

ఇచ్ఛాపురం : రోడ్డుపై బైఠాయించిన కార్మికులు

సూపర్ సిక్స్ పథకాలు ఏవీ?

మాజీ మంత్రి అప్పలరాజు

మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

పలాస : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు, సూపర్ సిక్స్ పథకాలు ఏమియ్యని మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రశ్నించారు. కాశీబుగ్గ ప్రైవేటు కళ్యాణ మంటపంలో శనివారం వైసిపి పట్టణ అధ్యక్షుడు శిష్టు గోపి అధ్యక్షతన బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వా ప్రభుత్వ పథకాలు పనితీరుపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. గ్రామసభలు నిర్వహించి ప్రజల సమస్యలను మన సమస్యలుగా బావించి పరిష్కారానికి పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైసిపి నాయకులను లక్ష్యాలు చేస్తూ కేసులు పెడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కేసులు పెట్టిన భయపడేది లేదన్నారు. ఏడాది దాటినా సూపర్ సిక్స్ అమలు చేయలేదన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ, మహిళలకు రూ.1500, వసతి దీవెన, విద్యా దీవెన ఇంతవరకు అమలు చేయలేదన్నారు. కార్యక్రమంలో హనుమంతు వెంకటరావు, మాజీ ఎంపిపి బత్తిన హేమేశ్వరరావు, ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, వైసిపి జిల్లా ఉపాధ్యక్షుడు పైల వెంకటరావు చిట్టి, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ప్రతినిధి పాలిన శ్రీనివాసరావు, వైస్ చైర్మన్లు మీసాల సురేష్‌బాబు, బోర కృష్ణారావు, దుర్గా శంకర్ పండా పాల్గొన్నారు.

కుటుంబ కలహాలే హత్యకు కారణం

- గోపి హత్య కేసులో 8 మంది అరెస్టు
- పరోక్ష నేర సంబంధాలపై కొనసాగుతున్న దర్యాప్తు
- వివరాలు వెల్లడించిన ఎఎస్‌పి కె.వి రమణ

వివరాలు వెల్లడిస్తున్న ఎఎస్‌పి రమణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఈ నెల 11న జిల్లాలో సంచలనం రేకెత్తించిన ఎచ్చెర్ల మండలం ఫరీదుపేటకు చెందిన సత్తారు గోపి హత్య కుటుంబ కలహాలేనని, ఈ కేసులో శుక్రవారం ఎనిమిది మందిని అరెస్టు చేశామని అదనపు ఎస్‌పి కె.వి.రమణ, డిఎస్‌పి సిహెచ్.వివేకనంద తెలిపారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్ విధించారని అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోపి హత్యలో ప్రత్యక్షంగా పాల్గొన్న కొత్తకోట సూర్యనారాయణ, పైడిపెద్ది సత్యనారాయణ, కొత్తకోట ఈశ్వరరావు, కొత్తకోట రంగనాథం, సీపాన శివకృష్ణ, సీపాన అనిల్‌కుమార్, పైడి రంగరామానుజులు, గురుగుబెల్లి భవానీలను అరెస్టు చెప్పారు. పరోక్షంగా నేరంతో సంబంధం ఉన్న వ్యక్తులపై దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వీరిని ఎస్ఎం పురం సమీపంలోని ట్రిపుల్ ఐటి మట్టి రోడ్డు వద్ద పట్టుకున్నట్లు వివరించారు. గ్రామానికి చెందిన గురుగుబెల్లి ఉమామహేశ్వరరావు ఎచ్చెర్ల ఎంపిపి అనుచరుడు అని అన్నారు. ఆయన భార్య భవనీ గత కొన్ని రోజుల నుంచి గొడవ పడుతున్నట్లు చెప్పారు. ఎంపిపి వద్ద పంచాయితీ నిర్వహించగా, తనకు న్యాయం జరగలేదని, ఎంపిపి ప్రత్యర్థి టిడిపి నాయకుడు కొత్తకోట అమ్మినాయుడు వద్దకు వెళ్లిందని అన్నారు. మరో పక్క ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ గృహహింస కేసు నమోదు చేశారన్నారు. అనంతరం అమ్మినాయుడు గ్రూపునకు చెందిన వ్యక్తులతో వెళ్లి ఫరీదుపేట జగనన్న కాలనీలో ఉన్న ఇంటి తలుపులు బద్దలు కొట్టి తన సామగ్రిని వాహనంలో తన అమ్మ నివాసం ఉంటున్న కొయ్యరాళ్ళ వద్ద తీసుకెళ్లినట్లు వివరించారు. మహేశ్వరరావుకి గోపి మద్దత్‌గా నిలిచారు. భవనికి మద్దత్‌గా ఉన్న వ్యక్తులతో ఘర్షణకు దిగినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు నుంచి బైక్‌పై ఇంటికి వస్తున్న గోపితో తన ప్రత్యర్థులు 11న మధ్యాహ్నం 2.30 గంటలకు ఘర్షణ పడ్డారని అన్నారు. దాడి చేసి పక్కాన ఉన్న మట్టి రోడ్డుపైకి తీసుకెళ్లి కర్రలతో కొట్టి, సిమెంట్ ఇటుకతో తలపై దాడిచేసి హతమార్చినట్లు తెలిపారు. అనంతరం గోపి బైక్ వెనుక కూర్చొన్న ప్రత్యక్ష సాక్షి (ఈయనను నిందితులు సంఘటన సమయంలో వెంట పెట్టారు) సత్తారు కోటేశ్వరరావు ఎచ్చెర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారని అన్నారు. మృతుడు గోపిపై అనేక క్రిమినల్ కేసులు ఉన్నాయని, గతంతో దాడి చేసిన నిందితులకు వ్యక్తి గత కక్షలు ఉన్నాయన్నారు. సమగ్ర దర్యాప్తు చేసి హత్యతో సంబంధం ఉన్న ఎవరినీ విడిచి పెట్టమనని స్పష్టం చేశారు. సమావేశంలో దర్యాప్తు అధికారి ఎం.అవతారం, ఎస్ఐ వి.సందీప్, ఎస్.చిరంజీవి, జి.లక్ష్మణరావు, ఎస్.బాలరాజు పాల్గొన్నారు.

కూటమిలో నామినేటెడ్ చిచ్చు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

కూటమి పార్టీల్లో అసమ్మతి రాగాలు క్రమేణా జోరందుకుంటున్నాయి. పదవులు దక్కలేదని కొందరు, పార్టీలో ప్రాధాన్యత ఉండటం లేదని మరికొందరు అలకబూనుతున్నారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వరుసగా నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తున్న క్రమంలో పదవులు రానివారు తీవ్ర అసంతృప్తికి లోనవుతున్నారు. తాజాగా వ్యవసాయ మార్కెట్ కమిటీ (ఎఎంసి) చైర్మన్ల నియామకం టిడిపి, జనసేన పార్టీల్లో మంటలు రేపింది. శ్రీకాకుళం ఎఎంసి చైర్మన్‌గా దారపు జ్యోత్స్న నియామకాన్ని జన సైనికులు జీర్ణించుకోలేకపోతున్నారు. జనసేన పార్టీ జిల్లా కార్యాలయం వద్ద ఏకంగా తమ నిరసన వెళ్లగక్కారు. ఎఎంసి చైర్మన్ పదవి దక్కిన మహిళ ఎవరనేది తెలుసుకోవడానికి తమకు రెండు గంటలు పట్టిందని, పదేళ్లుగా పార్టీకి పని చేసిన వారిని కాదని ఎన్నికల సమయంలో పార్టీలో చేరిన వ్యక్తికి చైర్మన్ పదవిని ఎలా ఇస్తారంటూ వారు ఆగ్రహంతో ఊగిపోతున్నారు. తొలి నుంచి పార్టీ బలోపేతానికి పనిచేసిన తమ విస్మరించడంపై వారంతా ఆవేదన వెలిబుచ్చుతున్నారు. పార్టీ నిర్ణయంపై కేంద్ర కార్యాలయానికి ఉత్తరాల ద్వారా నిరసన తెలపాలని నిర్ణయించారు. నామినేటెడ్ పదవుల భర్తీ మొదలు పెట్టిన నాటి నుంచి జనసేనలో అసంతృప్తి రాగాలు మొదలయ్యాయి. ఒక్కో విడతలో ఒక్కొక్కరికి పదవులు వస్తుండటంతో తమకు ఏదో ఒక విడతలో ఏదైనా గౌరవ ప్రదమైన హోదా దక్కుతుందని ఆశగా ఎదురుచూసిన వారికి రాష్ట్ర పార్టీ నాయకత్వం వారికి మొండి చేయి చూపుతూనే ఉంది. పార్టీ జెండాను మోసిన వారికి కాకుండా కొత్తగా పార్టీలో చేరిన వారికి పదవులు కట్టబెట్టడం పుండుమీద కారం చల్లినట్లయింది. తాజాగా శ్రీకాకుళం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దారపు జ్యోత్స్న నియామకమే ఒక ఉదాహరణ. ఈమె 2024 ఎన్నికల ముందు జనసేనలో చేరారని, ఈమె భర్తకు వైసిపితో విస్తృత సంబంధాలు ఉన్నాయంటూ నాయకులు ఆరోపిస్తున్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని పక్కన పెట్టి ఈమెకు పదవిని కట్టబెట్టడం పార్టీలో వివాదాన్ని రాజేసింది. జిల్లాలో పార్టీ పరిస్థితిపై జనసేనానికి సరియైన ఫీడ్ బ్యాక్ లేకపోవడంతో పదవుల విషయంలో అన్యాయం జరుగుతోందంటూ జనసైనికులు గగ్గోలు పెడుతున్నారు.

పార్టీ జిల్లా అధ్యక్షున్ని కూడా గుర్తించే పరిస్థితి జనసేనలో కనిపించడం లేదు. పార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షునిగా సేవలందిస్తున్న పిసిని చంద్రమోహన్‌కు గతంలో కాపు కార్పొరేషన్ డైరక్టర్ పదవికి ఎంపిక చేసింది. తర్వాత దానిని ఆయన సున్నితంగా తిరస్కరించారు. అత్యంత ప్రాధాన్యత ఉన్న శ్రీకాకుళం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్‌గా కొరికాన రవికి అప్పగించడంపై అప్పట్లో తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. మొదటి నుంచి పార్టీకి కష్టపడుతున్న వారిని కాదని, 2024 ఎన్నికల ముందే జనసేనలో చేరిన ఆయనకు పదవి ఇవ్వడంపై జనసైనికులు రగిలిపోయారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకం విషయంలో ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ చైర్మన్ ఎంపికపై మల్లగుల్లాలు పడుతున్నారు. ఇక్కడ బిజెపి ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తుండటంతో తమ పార్టీకి చెందిన వారికే ఎఎంసి చైర్మన్ దక్కాలని బిజెపి నాయకత్వం పట్టుబడుతుంది. బిజెపి విజయం సాధించినా అది టిడిపి మద్దతునే గెలిచిందని, టిడిపికి చెందిన వారికే చైర్మన్ పదవి ఇవ్వాలని టిడిపి నాయకత్వం గట్టిగా డిమాండ్ చేస్తోంది. చైర్మన్ పదవి ఎవరికి ఇచ్చినా ఇక్కడ అసంతృప్తి రేగడం ఖాయంగా కనిపిస్తోంది. ఒక వేళ టిడిపి నాయకులకే ఆ పదవి దక్కినా ఇందులోనూ రెండు గ్రూపులు ఉన్నాయి. ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు ఒక గ్రూపునకు నాయకత్వం వహిస్తుండగా, చీపురుపల్లి ఎమ్మెల్యే కళావెంకటరావుకు చెందిన నాయకులు వేరే గ్రూపుగా ఉన్నారు. పదవికి ఏ గ్రూపునకు దక్కినా రెండో గ్రూపు నాయకుల్లో అసంతృప్తికి దారి తీసే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పాతపట్నం నియోజకవర్గంలో పరిస్థితి వేరేగా ఉంది. నామినేటెట్ పదవులపై ఇక్కడ టిడిపి, జనసేన మధ్య పోటీ నెలకొంది. హిరమండలం ఎఎంసి చైర్మన్ పదవి టిడిపికే దక్కుతుందని మొదటి నుంచి ప్రచారంలో ఉంది. ప్రభుత్వం ప్రకటించిన పదవుల జాబితాలో జనసేన పార్టీకి చెందిన మామిడి రామకృష్ణారావు పేరు ఉండటంతో టిడిపి శ్రేణులు షాక్‌కు గురయ్యాయి. వాస్తవానికి ఎఎంసి చైర్మన్ పదవి ఎల్ఎన్‌పేట మండల టిడిపి పొదిలాపు కృష్ణమాచారికి వస్తుందని అంతా ఆశించారు. అటు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కూడా ఆయనకే పదవి వస్తుందని ఆరేడు నెలలుగా చెప్తూ వచ్చారు.

టిడిపి ఆవిర్భావం నుంచి పార్టీలో ఉంటూ 2024 ఎన్నికల్లో ఎమ్మెల్యే గోవిందరావుకు మద్దతుగా తిరుగుతూ అన్ని రకాలుగా నష్టపోయిన ఆయనకు పదవి రాకపోవడం పార్టీ శ్రేణులకు ఆశ్యర్యానికి గురి చేసింది. కంచిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నియామకం విషయంలో టిడిపి, జనసేన మధ్య చిచ్చు రేపింది. ఈ విడతలో తమకు కచ్చితంగా పదవి దక్కుతుందని ఆశించిన జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైపల్లి ఈశ్వరరావుకు నిరాశ తప్పలేదు. టిడిపికి చెందిన మద్దిల్లి విజయలక్ష్మికి ప్రభుత్వం చైర్మన్ పదవిని కట్టబెట్టడంతో అక్కడి జనసేన పార్టీలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. మొత్తం మీద నామినేటెడ్ పదవుల భర్తీలో ఏ విడతలోనూ లేనివిధంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ల నియామకంలో కూటమి పార్టీల్లో అసమ్మతిని రాజేసింది.

'ఉపాధి'లో రూ.3 కోట్లకు పైగా అక్రమాలు

- గుర్తించిన సామాజిక తనిఖీ బృందాలు
- మేట్లుతో సిబ్బంది కుమ్మక్కు
- ఏడాదిగా విధులకు డుమ్మా కొట్టిన ఫీల్డ్ అసిస్టెంట్
- సస్పెన్షన్ చేసిన డ్వామా పీడీ

ప్రజాశక్తి- లావేరు

మహాత్మాగాంధీ జాతీయ ఉపాధిహామీలో మండలంలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి రూ.29.59 కోట్లు మంజూరుకాగా 2,047 పనులు చేపట్టారు. ఇందులో కూలీల వేతనాల రూపంలో రూ.20 కోట్ల 2లక్షల 3252 చెల్లించగా, మెటీరియల్ కాంపోనెంట్ రూపంలో రూ 9.57 కోట్లు చెల్లింపులు చేశారు. మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో 20 రోజుల పాటు 14 డిఆర్‌పి బృందాలు గ్రామాల్లో చేసిన పనులను సామాజిక తనిఖీలు నిర్వహించారు. ఇందులో పెద్దఎత్తున అవకతవకలు జరిగినట్లు, రూ.3.5 కోట్లు అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీల్లో గుర్తించారు. శనివారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డ్వామా పీడీ బి.సుధాకరరావు ఆధ్వర్యంలో అధికారుల బృందం మండల సామాజిక ప్రజావేదిక నిర్వహించారు. ఇందులో ఒక్కో గ్రామ పంచాయతీ వారీగా బృందాలు సర్వే చేసి గుర్తించిన విషయాలు చదివి వినిపించారు. కోకొల్లలుగా అవకతవకలు, అవినీతి అక్రమాలు వెలుగు చూశాయి. మృతి చెందిన వారు, ఉద్యోగులు, బాలింతలు తదితరులు పనికి వెళ్లకుండా వెళ్లినట్లు దొంగ మస్టర్లు, కొలతల్లో భారీ వ్యత్యాసం, పనులు చేయకుండా పనులు చేసినట్లు బిల్లు చెల్లించినట్లు తెలిపారు. లావేరు గ్రామ పంచాయతీలోనే రూ.35 లక్షల అక్రమాలు జరిగినట్లు డిఆర్‌పి రామారావు సభలో వెల్లడించారు. ఆశా కార్యకర్తలు, ప్రభుత్వ ఉద్యోగులు, బాలింతలు పనులకు వెళ్లినట్టు మస్టర్లు వేసి బినామీలకు బిల్లులు చెల్లింపులు చేశారు. కొలతల్లో భారీగా తేడాలు, చేసిన తక్కువ పనిని రికార్డుల్లో ఎక్కువుగా నమోదు చేసి బిల్లు చెల్లింపు చేసినట్టుగా గుర్తించారు. మేట్లు, టిఎలు, కంప్యూటర్ సిబ్బంది కుమ్మక్కై భారీగా అవకతవకలు జరిగినట్లు వెల్లడించారు. ప్రతీ పంచాయతీలో చేసిన సర్వే వివరాలు సభలో చదువుతుంటే పీడీతో పాటుగా అధికారులు విస్మయం చెందారు. అవినీతి అక్రమాలపై ఆందోళన చెందారు. లావేరు ఫీల్డ్ అసిస్టెంట్ సుమారుగా ఏడాదిగా విధులకు హాజరు కాకపోవడంతో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన ఎఫ్ఎ రాముపై చర్యలు ఎందుకు తీసుకోలేదని ఇన్‌ఛార్జిని ఎందుకు నియమించలేదని పీడీ ఎపిఒ సత్యవతిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెంటే ఎఫ్ఎను సస్పెండ్ చేస్తున్నట్టు ప్రకటిస్తూ వెంటనే తొలగించాలని ఆదేశించారు. అలాగే పైడాయవలస పంచాయతీలో 8 మంది మరణించిన వారి పేరున పనికి వెళ్లినట్లు మస్టర్లు వేసి బిల్లు చెల్లింపు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో మేట్లు, ఉపాధి సిబ్బంది కుమ్మక్కై భారీగా అవినీతి అక్రమాలు జరిగినట్లు సామాజిక తనిఖీల్లో వెలుగు చూశాయి. మండల వ్యాప్తంగా రూ.3.5 కోట్లు అవినీతి అక్రమాలు జరిగి బిల్లులు అన్యాయంగా చెల్లింపులు జరిపినట్లు గుర్తించారు. ప్రజావేదిక ప్రారంభంలో ఎమ్మెల్యే ఎన్ఇఆర్ పాల్గొని ఉపాధిహామీ చట్టం పారదర్శకంగా ఉండాలని చెప్పారు. కార్యక్రమంలో డివిఒ లవరాజు, ఎపిడిలు పంచాది రాధ, ఎస్.లోకేష్, జిల్లా ఇన్‌ఛార్జి గౌరీ, ఎస్ఆర్‌పిలు బి.సూర్యనారాయణ, ఇ.సూర్యనారాయణ, డిఆర్‌పిలు, ఎంపిడిఒ పి.వెంకటరాజు, టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ తోటయ్యదొర, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా వేదికలో వివరాలు వెల్లడిస్తున్న డిఆర్‌పి రామారావు

నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

దల్లిపేటలో రైతుల నిరసన

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని దల్లిపేటలో వ్యవసాయ అధికారులు సక్రమంగా ఎరువుల పంపిణీ చేయడం లేదంటూ శనివారం సర్పంచ్ ప్రతినిధి కంబాపు సూర్యారావు ఆధ్వర్యంలో కొంతమంది రైతులు 1-బిలతో నిరసన వ్యక్తం చేశారు. యూరియ సచివాలయంలో కాకుండా అధికార పార్టీ వారికి చెందిన గొడాముల్లో నిల్వ చేశారని ఆరోపించారు. అయితే శనివారం యూరియా పంపిణీ చేసిన వ్యవసాయాధికారులు రైతుల ఆరోపణలపై స్పందించారు. సచివాలయంలో నిల్వ చేసేందుకు అవసరమైన స్థలం లేకపోవడంతో శుక్రవారం సాయంత్రం వచ్చిన యూరియాను వేరేచోట తాము భద్రపరిచామని తెలిపారు. రైతుల 1-బిల ఆధారాల మేరకు యూరియా పంపిణీ చేయడం జరిగిందని మండల ఎఒ శ్రీనివాసరావు తెలిపారు. కేవలం గ్రామంలో వ్యక్తిగత, రాజకీయ కారణాలతోనే యూరియా పంపిణీపై ఆరోపణలు చేస్తున్నారని అధికారులు తెలిపారు.

కవిటి : మాట్లాడుతున్న ప్రకాష్

నేడు 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారంటీ'

ప్రజాశక్తి- కవిటి

వైసిపి నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ - మోసం గ్యారంటీ' కార్యక్రమం మూడో దశను గ్రామస్థాయిలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్ అన్నారు. ఈ సందర్భంగా శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఆదివారం ఉదయం మండల కేంద్రంలోని అగ్నికుల క్షత్రియ సంఘ భవనంలో విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడాన్ని ప్రజలకు వివరించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు పిఎం తిలక్, పూడి నీలాచలం, కర్రి గోపయ్య, జల్లు యుగంధర్, ఎస్‌పి నారాయణస్వామి, వై.నీలయ్య, ఎన్ని అశోక్, పి.జయరామ్, బోస్, ఎస్‌పి ప్రవీణ్ పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : టెక్కలి కళ్యాణ మండపంలో ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ సభను నిర్వహించనున్నామని వైసిపి మండల అధ్యక్షులు హనుమంతు వెంకటేశ్వర నాయడు తెలిపారు. పట్టణంలో నిర్వహించిన విలేకరులతో మాట్లాడారు. కార్యక్రమానికి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త పేరాడ తిలక్ పాల్గొంటారని అన్నారు. సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు సత్తారు సత్యం, కిల్లి అజయ్, గణపతిరావు పాల్గొన్నారు.

ఆవిష్కరిస్తున్న కుమార్ నాయక్

'తర్లా తగువు' టీజర్ ఆవిష్కరణ

పలాస: మండలంలోని తర్లకోట బాయ్స్ క్రియేషన్ నిర్వహణ సారథ్యంలో పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి 15వ వార్డులో కె.ప్రకాష్ నిర్మాతగా తర్లా తగువు షార్ట్ ఫిల్మ్ టీజర్‌ను ఎపి తెలుగు ఫిలిం ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ కుమార్ నాయక్ శనివారం ఆవిష్కరించారు నేటి సామాజిక సమకాలిన పరిస్థితులపై క్రైమ్, థ్రిల్లర్, సస్పెన్స్‌తో పాటు తల్లిదండ్రులకు తెలియకుండా చెడు వ్యసనాలు ఆకర్షితులై నిండు నూరేళ్ల భవిష్యత్‌ను పాడు చేసుకుని జీవితాంతం బాధపడే యథార్థ ఘటన ఈ షార్ట్ ఫిలిం సారాంశమని చెప్పారు. దర్శకులుగా సంతోష్‌కుమార్, డిఒపిగా విజయ్, ఎడిటర్‌గా రాజు, హీరో వెంకటగిరి, విలన్ సోమేశ్వరరావు వ్యవహరించారు.

నిలదీస్తున్న సభ్యులు

రేషన్ పక్కదారి

కొత్తూరు: కెజిబివిలో విద్యార్థినులకు అందిస్తున్న ఆహార నాణ్యత లేదని, అలాగే రేషన్ పక్కదారి పడుతుందని ఎంఇఒ గోవిందరావును వైస్ ఎంపిపి లోతుగెడ్డ తులసీవరప్రసాదరావు ప్రశ్నించారు. కనీసం తనిఖీ చేయడం లేదని అసహనం వ్యక్తం చేశారు. ప్రత్యేక అధికారిని పల్లా రాధిక నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆమె పనితీరుపై విచారణ చేపట్టి ఉన్నతాధికారులకు నివేదిక అందజేయాలని కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి సవర సావిత్రి అధ్యక్షతన శనివారం మండల సమావేశం నిర్వహించారు. నీలకంఠాపురంలో లోవోల్టేజ్ సమస్య పరిష్కరించాలని విద్యుత్‌శాఖ ఎఇ శంకరరావును సర్పంచ్ ప్రతినిధి రామకృష్ణ కోరారు. మెట్టూరు-3 సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు మాట్లాడుతూ భూ సమస్యలు పరిష్కరించాలని తహశీల్దార్ కె.రామకృష్ణను కోరారు. దశల వారీగా సమస్య పరిష్కరిస్తామని తహశీల్దార్ అన్నారు. రైతు సేవాకేంద్రాలు ద్వారా రైతులకు అందిస్తున్న ఎరువులు సకాలంలో సరఫరా చేయడం లేదని, వ్యాపారులు అధిక ధరలకు అమ్ముతున్నారనిఎఇఒ స్వర్ణలతను సభ్యులను కోరారు. రైతులకు సంబంధించిన విత్తనాలను పరీక్షించేందుకు స్థానిక వ్యవసాయ కార్యాలయంలోని అగ్రి లేబ్‌ను టెక్కలి డివిజన్‌ను తీసుకోవడం సరికాదన్నారు. స్థానికంగా ఉండేందుకు సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో సమావేశంలో ఎంపిడిఒ నీరజ, ఉపాధ్యక్షులు మెండ సుమతి, ఎఒ బి.రాంబాబు, ఇఒపిఆర్‌డి వసంతకుమారి పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కోరారు. మండలంలోని కాగువాడలో బాబు స్యూరిటీ- మోసం గ్యారంటీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి జగన్ పాలనకు, ప్రస్తుత కూటమి పాలనకు మధ్య ఉన్న వ్యత్యాసాలను ప్రజలకు వివరించారు. చంద్రబాబు సూపర్ సిక్స్ వంటి అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చారని అన్నారు. ఏడాది అవుతున్నా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చలేదని అన్నారు. కార్యక్రమంలో వైసిపి కన్వీనర్ సవిరిగాన ప్రదీప్, ఉపాధ్యాయులు ఎ.వి.సురేష్, ఏనుగుతల సూర్యం పాల్గొన్నారు.

ఉపాధ్యాయునికి అవార్డు

నందిగాం: మండలంలో పెద్దతామరాపల్లి ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న మార్పు నారాయణమూర్తికి అవార్డు లభించింది. రాజమండ్రికి చెందిన క్రియేటివ్ హార్ట్స్ ఆధ్వర్యాన ఇటీవల ఆన్‌లైన్‌లో నిర్వహించిన జాతీయస్థాయి చిత్రలేఖన పోటీలలో పాల్గొని బెస్ట్ క్రియేటివ్ ఆర్టిస్టు అవార్డుకు ఎంపియ్యారు. ఈ అవార్డు దక్కడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు

పరామర్శిస్తున్న శ్రీధర్

శ్రీధర్ పరామర్శ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని పెదంచలకు చెందిన తలగాన మార్కండేయులు కుమార్తె తలగాన లేపాక్షి నైరలో అగ్రికల్చర్ బిఎస్‌సి చదువుతూ ఇటీవల మృతి చెందింది. విషయం తెలుసుకున్న న్యాయవాది దువ్వాడ శ్రీధర్ శనివారం మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ముందుగా లేపాక్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అలాగే మందస మండలం మకరజోలలో మజ్జి పున్నయ్య తల్లి మజ్జి లక్ష్మీదేవి కుటుంబ సభ్యులనూ పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. పరామర్శ వారిలో పలాస-కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు హరిప్రసాద్, గొర్లె వేను, భాస్కరరెడ్డి, రడబ్బీరు నాగభూషణరావు, కూ. హేమాచలం, ప్రసాద్ పాల్గొన్నారు.

'జాప్' జిల్లా ఉపాధ్యక్షునిగా శ్రీకాంత్

శ్రీకాంత్

సోంపేట : జర్నలిస్టు యూనియన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) కార్యవర్గానికి జిల్లా ఉపాధ్యక్షునిగా సీనియర్ జర్నలిస్టు భావన శ్రీకాంత్ ఎంపిక య్యారు. ఈనాడు, ఆంధ్రజ్యోతి పత్రికల్లో సుదీర్ఘంగా పనిచేసే, రెండు దశాబ్దాలుగా పాత్రికేయ వృత్తిలో కొనసాగుతున్నారు. ఈయనకు ఈ పదవిని అప్పగించడం సముచితమని జర్నలిస్టులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. సోంపేట మండలం లక్కవరానికి చెందిన శ్రీకాంత్ సీనియర్ జర్నలిస్టుగా అనేక పత్రికల్లో సేవలందిస్తూ సొంతంగా ఉద్దానం సాయంకాల పత్రిక ద్వారా ప్రజా సమస్యలను తనదైన శైలిలో ప్రజా సమస్యలు, సామాజిక సమస్యల పరిష్కారానికి తన వంతుగా సేవలందిస్తున్నారు.

మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తా

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి అగ్రగామిగా తీర్చిదిద్దే లక్ష్యంతో పని చేస్తున్నానని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం 14వ వార్డు ఐజె నాయుడు కాలనీ నుంచి లక్ష్ముడుపేటకు వెళ్లే రహదారి అభివృద్ధికి డెవలప్‌మెంట్ చార్జీల నిధులు రూ.27 లక్షల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. అనంతరం 15వ వార్డు పరిధిలోని మోనింగి వారి వీధి నుంచి పూజారిపేట వరకు 15వ ఆర్థిక సంఘం నిధుల నుంచి రూ.39.90 లక్షలతో బిటి రహదారి పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పన, సమస్యల పరిష్కారమే తన ధ్యేయమని పేర్కొన్నారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ప్రజలకు నాణ్యమైన సదుపాయాలు అందిస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ అధ్యక్షులు శిమ్మ మాధవి, టిడిపి నాయకులు మొదలవలస రమేష్, బోర గోవిందరావు, మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పారావు, పివివి ప్రసాద్, నాగళ్ల మురళీధర్ యాదవ్, పాతిన రమణమూర్తి, అన్నెపు సత్యనారాయణ, బగాన అమ్మినాయుడు, గుడ్ల రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

సమావేశంలో అధికారులను నిలదీస్తున్న డీలర్లు

తూనికలో మోసాన్ని అరికట్టాలి

సిబ్బందిని మార్చకపోతే సరుకులు తీసుకెళ్లం : డీలర్లు

లావేరు: మండల పౌరసరఫరాల గోదాం వద్ద తూకంలో మోసాన్ని అరికట్టి, అక్కడ సిఒ అమర్, సిబ్బంది కరుణాకర్‌లను మార్చకపోతే తాము వచ్చేనెల నుంచి సరుకులు తీసుకెళ్లమని మండల డీలర్లు ఆందోళన చేశారు. శనివారం లావేరు తహశీల్దార్ కార్యాలయంలో డిటి బి.శ్రీనువాసరావు అధ్యక్షతన డీలర్లుతో సమావేశం నిర్వహించారు. సిఎస్ డిటి అరుణ, గోదాం ఇన్‌ఛార్జి ప్రవీణ్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోదాం వద్ద తూకంలో మోసం చేస్తున్నారని ప్రజాశక్తిలో వచ్చిన క్లిప్పింగ్ చూపించారు. 50 మందికిపైగా రేషన్ డీలర్లు గోదాం వద్ద సిబ్బందిని మార్చకపోతే తాము డిపోలకు సరుకులు తీసుకెళ్లమని అధికారుల ముందు వాపోయారు. ప్రతినెలా ఒక్కో డీలర్ 2 నుంచి 3 క్వింటాలు చొప్పున తూకంలో మోసంతో నష్ట పోతున్నామని, అక్కడ సిబ్బందిని మార్చాలని నిలదీశారు. ప్రతి బస్తా 50 కిలోల 580 గ్రామాలు చొప్పున తూకం వేయాలని డీలర్లు బాడిత హరికృష్ణ, ఇజ్జాడా వెంకటరమణ, రామ్మూర్తి, యినపకుర్తి అప్పుడు, ఇజ్జు సత్తిబాబు, ముప్పిడి రమేష్, మంగరాజు తదితరులు నిలదీశారు. గోదాం వద్ద సిబ్బందిని మార్చేందుకు అధికారుల దృష్టికి తీసుకువెళ్తామని, వారు లేకుండా సరుకులు ఇచ్చేందుకు అధికారులు హామీ ఇవ్వడంతో డీలర్లు శాంతించారు. అంతకు ముందు తరుగులు, తూకంలో మోసంపై సమావేశంలో గందరగోళం ఏర్పడింది. సమావేశంలో మండలంలోని డీలర్లు పాల్గొన్నారు.

పి4పై అవగాహన

మెళియాపుట్టి : పి4 కార్యక్రమంలో భాగంగా నిరు పేదలను ధనవంతులు చేసేందుకు బంగారు కుటుంబాలను ఎంపిక చేస్తున్నామని జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా అన్నారు. మండలంలోని బాణాపురం పంచాయతీలో బంగారు కుటుంబాలపై శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో పేద కుటుంబాలను ఎంపిక చేసి వారికి చేయూత అందించడమే బంగారు కుటుంబాల ముఖ్య ఉద్దేశ్యమన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, ఎఇపిఆర్‌డి తారకేశ్వరి, ఎఎఒ ప్రభావతి ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, కొర్ల కగేశ్వరరావు పాల్గొన్నారు.

పలాస : మండలంలోని బొడ్డపాడులో పి4 గ్రామసభను ఎంపిడిఒ వసంతకుమార్ నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ మెట్ట వైకుంఠరావు, సర్పంచ్ తామడ మధన్, కార్యదర్శి సుధాకర్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ప్రభుత్వం అమలు చేస్తున్న పి4 కార్యక్రమంపై వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ కుమార్, కౌన్సిలర్ ప్రతినిధి కాళ్ల జయదేవ్, 21, 22 వార్డుల్లో శనివారం అవగాహన కల్పించారు. నిరుపేదలకు ధనవంతులు చేసేందుకు బంగారు కుటుంబాలుని ఎంపిక చేసి వారికి చేయూత అందించడమే బంగారు కుటుంబాలు ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమంలో సచివాలయం సిబ్బంది కృష్ణకుమారి, స్వాతి, సుమిత్ర, లలిత్, శ్రీదేవి, రమణమ్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మాట్లాడుతున్న జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా

'కూటమిది అరాచక పాలన'

ఆమదాలవలస : సమావేశంలో మాట్లాడుతున్న రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని బొడ్డేపల్లిపేట వద్ద నున్న వైసిపి కార్యాలయంలో బాబూ ష్యూరిటీ...మోసం గ్యారంటీ సమావేశం తమ్మినేని శ్రీరామ్మూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చింతాడ రవికుమార్ మాట్లాడుతూ 2029 ఎన్నికల్లో జగన్ మోహన్ రెడ్డిని సిఎంగా ప్రజలు ఎంపిక చేయాలన్నదే లక్ష్యంగా ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే పని చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అరాచక పాలన చేస్తోందని, అందువల్ల ప్రజల నమ్మకాన్ని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసిలు బెండి గోవిందరావు, సురవరపు నాగేశ్వరరావు, వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బొడ్డేపల్లి రమేష్ కుమార్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు గురుగుబెల్లి శ్రీనివాసరావు, నాయకులు ఖండాపు గోవిందరావు, దుంపల శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం: మండలంలోని రావాడ, తెప్పలవలస పంచాయతీ సీతారాంపురం గ్రామాల్లో ఎచ్చెర్ల మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో బాబూ ష్యూరిటీ - మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వైసిపి రణస్థలం మండల అధ్యక్షులు గొర్లె శ్రీనివాసరావు నిర్వహించారు. ప్రజల వద్దకు వెళ్లి క్యూ ఆర్ కోడ్‌ను స్కాన్ చేయించి చంద్రబాబు చేసిన మోసాలను ప్రజలకు వీడియో రూపంలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు చంద్రబాబు చేసిన మోసాలను తెలియజేస్తూ, జగన్మోహన్ రెడ్డి గత ప్రభుత్వంలో అందించిన సంక్షేమాన్ని మరోసారి గుర్తుచేశారు. కార్యక్రమంలో రాష్ట్ర యువజన విభాగం సంయుక్త కార్యదర్శి పిన్నింటి సత్యం నాయుడు, బిసిసెల్ అధ్యక్షులు మజ్జి రమేష్, వైస్ ఎంపిపి రాయపురెడ్డి బుజ్జి, మండల ఎగ్జిక్యూటివ్ మెంబెర్స్ మహంతి అప్పల నాయుడు, టేకు బ్రహ్మాజీ, ఎంపిటిసి ప్రతినిధి కిల్లారి సూర్యనారాయణ, మాజీ సొసైటీ అధ్యక్షులు కిల్లారి రమణ, దన్నాన హరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యంత్రాలతో సాగు లాభదాయకం

ప్రజాశక్తి- రణస్థలం

తక్కువ నీటితో లాభదాయక దిగుబడులు పొందడం ఆరుతడి వరి సాగు విధానం ద్వారా సాధ్యమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ ఆర్.హరిబాబు అన్నారు. శనివారం మండలంలోని వెంకటరావుపేటలో విత్తనం, ఎరువు ఒకేసారి వేసే యంత్రంతో నేరుగా వరి విత్తే విధానంపై రైతులకు అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో నీటి లభ్యత తక్కువగా ఉండటం వలన, వర్షాధారంగా పండించే భూముల్లో, అడపాదడపా నీరందించే సౌకర్యం కలిగిన ప్రాంతాల్లో, చెరువుల కింద సాగుచేసే పొలాల్లో ఈ విధానం అనుకూలంగా ఉంటుందన్నారు. వరినాట్లు సకాలంలో వేసినప్పుడే అధిక దిగుబడులు సాధ్యమవుతాయని, రైతులు సులువైన పద్ధతులైన డ్రమ్స్ సీడింగ్, విత్తనం, ఎరువు ఒకేసారి వేసే యంత్రాలపై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. దీనివలన ఖర్చు తగ్గడమే కాకుండా వారం రోజుల ముందే కోతకు వస్తుందని, విత్తనాలు వరుసల్లో పడడం వలన పురుగులు, తెగులు సమస్య తక్కువన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పతివాడ అప్పల నరసయ్య పొలంలో విత్తనం, ఎరువు ఒకేసారి నేరుగా విత్తే యంత్రంతో క్షేత్రస్థాయి ప్రదర్శన చేసి చూపించారు. కార్యక్రమంలో మండల ఎఒ కె.విజయభాస్కర్, డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు, సమన్వయకర్తలు ఎస్.పి.నారాయణరావు, పి.రమణ, గ్రామ వ్యవసాయ సహాయకులు, లీడ్ ఫార్మర్స్ కె.రాము తదితరులు పాల్గొన్నారు.

రణస్థలం : రైతులకు అవగాహన కల్పిస్తున్న రెడ్డీస్ ప్రతినిధులు

సరుబుజ్జిలి: వర్షాభావ పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో రైతులు సీడ్‌డ్రిల్ యంత్రాన్ని వినియోగించుకోవడం ద్వారా నేరుగా వరిసాగు చేపట్టడం లాభదాయకమని కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ కె.భాగ్యలక్ష్మి తెలిపారు. సరుబుజ్జిలి మండలం వెన్నెలవలసలో సీడ్‌డ్రిల్ యంత్రం ద్వారా సాగు చేసిన వరిలో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డీస్ ఫౌండేషన్ అందిస్తున్న సీడ్‌డ్రిల్ యంత్రాల సహకారంతో సాగు జరుగుతుందని తెలియజేశారు. రాయ్, హరికుమార్ ముఖ్య అతిథులుగా విచ్చేసి రైతులకు సీడ్‌డ్రిల్ యంత్ర వినియోగంపై వివరించారు. కార్యక్రమంలో రెడ్డీస్ ఫౌండేషన్ జిల్లా కో-ఆర్డినేటర్లు అత్తులూరి లావణ్య, పాతిని శ్రీనివాసరావు, సివ్వాల కుమారి, రైతుమిత్రలు పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యం

ఢిల్లేశ్వరరావు

నందిగాం : మండలంలోని దిమ్మిడిజాలకు చెందిన సలానా ఢిల్లేశ్వరరావు అదృశ్యమయ్యారని ఎస్ఐ కె.జగన్నాథరావు శనివారం తెలిపారు. ఈ నెల 12న శ్రీకాకుళంలోనే ఓ ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లారని అన్నారు. అక్కడే గాత్రి కళాశాలలో తన మనవడు కోసం చూశాడని తెలిపారు. అనంతరం ఇంటికి వెళ్లకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువుల ఇళ్లలో వాకబ్ చేశారని చెప్పారు. ఆచూకీ లభించకపోవడంతో కుమారుడు తిరుపతిరావు ఫిర్యాదు చేశారని, ఆ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తెలిపారు.

పరిశీలిస్తున్న సిఐ సూర్యనారాయణ

వివేకానంద కాలనీలో చోరీ

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ వివేకానందకాలనీలో నివాసం ఉంటున్న కొండాల వనజాక్షి ఇంట్లో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఈ చోరీలో రూ.1.25 లక్షల విలువైన 14 గ్రాముల బంగారం, రూ.40 వేలు నగదు దొంగలు తస్కరించినట్లు బాధితురాలు కాశీబుగ్గ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వనజాక్షి కాశీబుగ్గలో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సుగా పనిచేస్తుంది. ఈ క్రమంలో ఇంటికి తాళాలు వేసి రాత్రి విధులకు వెళ్లింది. శనివారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళాలు విరగొట్టినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు పరిశీలించారు. ఈ మేరకు సిఐ పి.సూర్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకొని దొంగతనం జరిగిన తీరు పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.


నిందితులతో ఎస్ఐ హరికృష్ణ

ఐదుగురికి జైలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం 1వ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో గల జిల్లా పరిషత్ ఎదురుగా కామేశ్వరి కళ్యాణ మండపం వెనుక వైపు ఉన్న బోను గోవింద ఇంటి ముందు బహిరంగ ప్రదేశంలో జూదం (పేకాట) గురువారం ఆడుతున్నారని ఒకటవ పట్టణ పోలీసులు దాడిచేశారు. దాడిలో బోను గోవింద, బలగ ప్రసాద్, షేక్ కబీర్ ఆలీ, మచ్చ మోహన కృష్ణ, మొకర రాజశేఖర్ పేకాట ఆడుతూ పట్టుబడ్డారని ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు. వారి వద్ద నుంచి రూ. 46,970, ఐదు సెల్‌ఫోన్లు సీజ్ చేసినట్లు చెప్పారు. వారిని శ్రీకాకుళం స్పెషల్ జుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ శివరామకృష్ణ ముందు శనివారం హాజరుపర్చగా నెలరోజులు జైలు శిక్ష విధించారు. కోర్టు ఉత్తర్వుల మేరకు జిల్లా జైలుకు తరలించినట్లు చెప్పారు. జూదాలపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు తెలిపారు.

చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే అశోక్

సిఎం సహాయ నిధి అందజేత

ప్రజాశక్తి- కవిటి

హృదయ సంబంధ వ్యాధితో బాధపడుతూ ఇటీవల వైద్యం చేసుకున్న సహలాలపుట్టుగకు చెందిన ఎర్ర సావిత్రికి ముఖ్యమంత్రి సహాయ నిధి అండగా నిలిచింది. సావిత్రి ఆర్థిక పరిస్థితిని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నాయకులు ఆమెకు ఆర్థికంగా అండగా నిలవాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన విప్ ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి ఆమెకు రూ.2.53 లక్షలు మంజూరయ్యేలా చేశారు. దీనికి సంబంధించిన చెక్కును శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే అశోక్ సావిత్రికి అందించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షుడు ఎర్ర బాసుదేవ్ ప్రధాన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న గౌతు శిరీష

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయం

ప్రజాశక్తి- పలాస

మున్సిపాలిటీ అభివృద్ధే ధ్యేయమని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని 12 వార్డులో రూ.15 లక్షల వ్యయంతో దోబీ ఘాట్ నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో తాగునీటి సరఫరాతో నీటి ఎద్దడి నివారించామని చెప్పారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రామారావు, ఎపి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, లొడగల కామేశ్వరరావు, గురిటి సూర్యనారాయణ, గాలి కృష్ణారావు, టంకాల రవిశంకర్ గుప్తా, మల్లా శ్రీనివాసరావు, కొత్త సత్యం దడియాల నరసింహులు, కొండే నర్సింహులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ కిరణ్‌కుమార్

రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

స్వయం సహాయక సంఘ సభ్యులు తీసుకుంటున్న రుణాలతో యూనిట్లు గ్రౌండ్ చేయాలని, దాని ద్వారా వారి కుటుంబం ఆదాయం పెరుగుతూ జీవన ప్రమాణ స్థాయి పెంచుకోవాలని డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సర్ఫ్, డిఆర్‌డిఎ ఆధ్వర్యాన కోటబొమ్మాళి, సంతబొమ్మాళి టెక్కలి, నందిగాం, సారవకోట మండలాల బ్యాంకు మేనేజర్లు, ఎపిఎంలు, సిసిలతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక స్వయం సహాయక సంఘ సభ్యులు ఎంటర్‌ప్రైజెస్ యువర్ కావాలని, దీనికి అవసరమైన సహాయ, సహకారాలను తెలియజేశారు. ఎల్‌డిఎం పి.శ్రీనివాసరావు, బ్యాంకు లింకేజీ డిపిఎం నాగలక్ష్మి, స్త్రీ నిధి ఎజిఎం సత్యనారాయణ, ఎపిడి సన్యాసిరావు, సూర్య నారాయణ, మనోరత్నం, శ్రీనివాసరావు, ఉమారాణి పాల్గొన్నారు.

ట్రాఫిక్ ఆంక్షలను ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి- పలాస

సూర్యనారాయణ, సిఐ

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని, నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కాశీబుగ్గ సిఐ పి.సూర్య నారాయణ తెలిపారు. కాశీబుగ్గ పోలీసుస్టేషన్ లో శనివారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హెవీ వెహికల్స్ తెల్లవారి 7.30 గంటల నుంచి రాత్రి పది గంటల వరకు పలాస-కాశీబుగ్గ జంటపట్టణాల్లోకి రాకూడదన్నారు. ఆ సమయంలో సాధారణ వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకొని భారీ వాహనాలు పట్టణాల్లోకి రావద్దని సూచించారు. మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొన్ని వాహనాలకు మినహాయింపు ఇచ్చామన్నారు. అత్యవసర వాహనాలు, కూరగాయలు, పాలు, గ్యాస్ బండలు తీసుకువచ్చే వాహనాలు ఆ సమయంలో రావచ్చున్నారు. తెల్లవారి 8 నుంచి 11, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ విపరీతంగా రద్దీ ఉంటుందని, ఆ సమయంలో భారీ వాహనాలు పూర్తిగా పట్టణంలోకి రావడానికి వీలులేదని స్పష్టం చేశారు. ట్రాఫిక్ నియంత్రణకు పూర్తిస్థాయి చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఉదయం నుంచి రాత్రి వరకూ పట్టణం బయట రహదారుల వద్ద సిబ్బందిని నియమించి ట్రాఫిక్ క్రమబద్ధీకరిస్తామన్నారు. దీంతో పాటుగా లక్ష్మీపురం టోలేటును తప్పించుకోవడానికి ఎక్కువగా లారీలు, ఇతర గూడ్స్ వాహనాలు పట్టణంలోకి వస్తున్నాయని, ఇక నుంచి అటువంటి వాహనాలు వస్తే భారీ జరిమానా వేస్తామని స్పష్టం చేశారు.

ఉర్దూ పాఠశాల ఏర్పాటు చేయాలి

ఆమదాలవలస : పట్టణంలోని ముస్లిం కాలనీలో ఉర్దూ మాధ్యమ పాఠశాలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర టిడిపి మైనార్టీ విభాగ కార్యదర్శి షేక్ మాలిక్ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు విజ్ఞప్తి చేశారు. శనివారం పట్టణంలోని టిడిపి కార్యాలయంలో 20 ముస్లిం కుటుంబాలు ఎమ్మెల్యేను సన్మానించాయి. ఈ సందర్భంగా చక్కెర కర్మాగారానికి సమీపంలోని ముస్లింకాలనీలో ఉర్దూ పాఠశాల అవసరాన్ని వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఎమ్మెల్యే స్పందిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, షేక్ కలేశా, షేక్ అప్సర్, షేక్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

జింకిభద్రలో ఎస్ఐ రాత్రి బస

సోంపేట : మండలంలోని జింకిభద్రలో ఎస్ఐ లవరాజు శనివారం రాత్రి బస చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో నిద్రించారు. అనంతరం శనివారం ఉదయం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సోంపేట ఇఒ శాంతకుమారి మాట్లాడుతూ పారిశుధ్యం మెరుగు విషయంలో ప్రజలు అధికారుల సూచనలు పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

ప్రజాశక్తి-శ్రీకాకుళం సిటీ

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా కృషి చేయాలని జిల్లా ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి పిలుపు మేరకు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌లు, సర్కిల్ కార్యాలయాల పరిధిలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని శనివారం పోలీసులు చేపట్టారు. పోలీస్‌స్టేషన్ పరిసరాల్లో చెత్తాచెదారం పిచ్చి మొక్కలు తొలగింపుతో పాటు స్టేషన్లను శుభ్రం చేశారు.

నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్ పరిసర ప్రాంతాల్లో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. స్వచ్ఛాంధ్ర లక్ష్యంగా ప్రతిఒక్కరూ ముందుకు రావాలన్నారు.

రణస్థలం: మండలంలోని పారిశ్రామిక వాడ పైడిభీమవరం అపిటోరియా ఫార్మాలో స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఫ్యాక్టరీల విభాగ డైరెక్టర్ డి.చంద్రశేఖర్ వర్మ, జాయింట్ డైరెక్టర్ అఫ్ ఫ్యాక్టరీస్ జె.శివ శంకర్ రెడ్డి, ఫ్యాక్టరీ మేనేజర్ ఎస్.మదన్ కుమార్, ఇహెచ్ఎస్ హెడ్ ఇ.సంపత్ రెడ్డి పాల్గొన్నారు. కార్మికులు, ఉద్యోగులు, పిల్లల కోసం ప్లాస్టిక్ కాలుష్య నిర్మూలనపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. భద్రతా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

పొందూరు: స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో ప్లాస్టిక్ వాడకం నిర్మూలనపై నిర్వహించిన ర్యాలీలో తహశీల్దార్ ఆర్.వెంకటేష్ రామానుజులు, ఎంపిడిఒ మీసాల మన్మథరావు పాల్గొన్నారు. మండల పార్టీ అధ్యక్షులు చిగులపల్లి రామ్మోహన్, సర్పంచ్ రేగడి లక్ష్మి, ఇఒపిఆర్‌డి సింహాచలం, ఎంఇఒ రాజారావు, ఇఒ మోహన్ బాబు, ఎపిఒ శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళా అధ్యక్షులు ఎ.విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎచ్చెర్ల: డా. బిఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో స్వచ్ఛ ఆంధ్రా నిర్వహించారు. వైస్ ఛాన్సలర్ కె.ఆర్.రజనితో పాటు రెక్టార్ ఆచార్య బి.అడ్డయ్య, వర్శిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు డా. ఎం.అనురాధ, డా. సిహెచ్. రాజశేఖరరావు, స్వచ్ఛ ఆంధ్రా క్యాంపస్ నోడల్ అధికారి డి.చక్రపాణి, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

లావేరు: లావేరులో స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ర్యాలీలో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. చెత్తాచెదారాలను తొలగించారు. అనంతరం సచివాలయం వద్ద ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ సేవకులను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.వెంకటారాజు, టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, ఎచ్చెర్ల ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, పి.మధుబాబు, నాయకులు పాల్గొన్నారు.

సోంపేట : బారువ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ హరిబాబు నాయుడు ఆధ్వర్యాన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో పరిసరాల్లో పిచ్చిమొక్కలని తొలగించారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా పరిసరాల్లోని గోతులని పూడ్చిపెట్టారు.

పట్టణంలోని హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, కూరగాయల షాపుల, పండ్ల జ్యూస్ షాపుల యజమానులకు సోంపేట పంచాయతీ ఇఒ ఎం.శాంతికుమారి పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. టౌన్‌లో చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉంచడానికి బ్లీచింగ్ పౌడర్ చల్లించడం, బోర్డులు పెట్టి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.

వజ్రపుకొత్తూరు: పచ్చదనం పరిరక్షణ పరిశుభ్రత పాటించడం అందరి భాధ్యత అని ప్రధానోపాధ్యాయులు టి.హేమరావు అన్నారు. మండలంలోని నగరంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంల పిఎంసి చైర్మన్ బి.లక్ష్మీపతి, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

టెక్కలి రూరల్ : స్వర్ణాంధ్రలో భాగంగా టెక్కలిలో ప్లాస్టిక్ నిషేధంపై సర్పంచ్ గొండెల సుజాత ఆధ్వర్యాన ర్యాలీ, మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డిఎల్‌డిఒ అలివేలు మంగమ్మ, డిప్యూటీ ఎంపిడిఒ కె.సింహాద్రి, ఇఒ ఎ.వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : పట్టణంలోని శాంతినికేతన్ హైస్కూల్‌లో స్వచ్ఛాంధ్రపై చైర్మన్ డి.కృష్ణమూర్తిరెడ్డి అవగాహనా ర్యాలీ నిర్వహించారు. మేనేజర్ కె.సి.పూరి. ఉపాధ్యాయులు సురేఖ, పద్మజ, శ్రీధర్, శాంతి, రవి, రాజ్యలక్ష్మి ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ మోహన్ ప్రియా, సెక్రటరీ డి.హర్షవర్ధన్‌రెడ్డి, జిహారిక, యువశ్రీ, హారిక పాల్గొన్నారు.

కవిటి : ప్లాస్టిక్ తో ప్రపంచానికే ముప్పని, ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని తహశీల్దార్ మురళీ మోహన్ సూచించారు. స్వర్ణాంధ్రలో భాగంగా ముత్యాలపేట, కవిటి ప్రభుత్వ జూనియర్ కళాశాల, తహశీల్దార్, ఎంపిడిఒకార్యాలయాల్లో ప్లాస్టిక్ ఫ్రీ డే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐ రమణమూర్తి, డిటి కృష్ణమూర్తి, జిజె కాకేజ్ ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు పాల్గొన్నారు.

కొత్తూరు : స్థానిక కోర్టు ఆవరణలో స్టెన్ ఫోర్డ్ స్కూల్ విద్యార్థులు చెత్తను ఏరివేసి డబ్బింగ్ యార్డుకు తరలించారు. కార్యక్రమంలో జి.కృష్ణారావు, ఎంఇఒ ఎ.గోవిందరావు, ఎపిఎం లలితకుమారి పాల్గొన్నారు.

కోటబొమ్మాళి: మండలంలోని హరిశ్చంద్రపురంలో నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో ఎంపిడిఒ జె.ఆనందరావు, కార్యక్రమంలో వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పలాస : పలాస-కాశీబుగ్గ మున్సిపాల్ కార్యాలయం ప్లాస్టిక్ రహిత కార్యాలయాలుగా చూడాలని చైర్మన్ బళ్ల గిరిబాబు అన్నారు. పారిశుధ్య కార్మికులను సన్మానించారు.

నందిగాం : స్థానిక పశువైద్యశాల ఆవరణలో నిర్వహించిన స్వచ్ఛాంధ్రలో పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి.చంద్రశేఖరరావు, పశువైద్యాధికారి మన్మథరావు, విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే శంకర్, తదితరులు

శక్తి యాప్‌పై అవగాహన అవసరం

బూర్జ : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ వాసుదేవరావు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలో కొల్లివలస కెజిబివి పాఠశాలలో శనివారం పాఠశాలలో శక్తియాప్‌పై విద్యార్థులకు ఎస్ఐ జి.వాసుదేవరావు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఎటువంటి ఆపదలో ఉన్నా అత్యవసర పరిస్థితి సమయంలో శక్తి యాప్‌ని ఉపయోగించుకొని రక్షణ పొందాలన్నారు. అలాగే మీతో పాటు మీ స్నేహితులకు, కుటుంబ సభ్యులకు శక్తియాప్‌పై మరింత అవగాహన కల్పించి ప్రతి ఒక్కరి మొబైల్ ఫోన్‌లో శక్తియాప్ ఉండే విధంగా కృషి చేయాలన్నారు. ఎఎస్ఐ డి.రమణమూర్తి, సిబ్బంది జె.రమేష్, జి.మోహనరావు, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

పలాస: విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలని, చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మదర్ థెరీసా పాఠశాల కరస్పాండెంట్ వజ్జ గంగాభవాని సూచించారు. పాఠశాల ఆవరణలో శనివారం శ్రీకాకుళం పోలీసుల ఆధ్వర్యాన మత్తు పదార్థాలు వాడవద్దని, శక్తి యాప్‌పై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలపై దాడి చేసినా, విద్యార్థినులను వేధించినా శక్తి యాప్ ద్వారా ఫిర్యాదు చేసుకోవచ్చు అన్నారు. శక్తి యాప్ మహిళా విద్యార్థినులకు ధైర్యాన్ని ఇస్తుందన్నారు. గంజాయి, మద్యం సేవించడం ద్వారా ఆరోగ్యం పాడవుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎఎస్ఐ భైరాగి, ధనలక్ష్మి, తిరుపతి, సప్తగిరి, పాఠశాల ఇన్‌ఛార్జి ప్రసాదరావు, ఉపాధ్యాయులు జోగారావు, కూర్మారావు, శశిరేఖ పాల్గొన్నారు.

పలాస : అవగాహన కల్పిస్తున్న శక్తి యాప్ బృందం

కూటమితోనే సుపరిపాలన సాధ్యం

ఆమదాలవలస : తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే

ప్రజాశక్తి- ఆమదాలవలస

సుపరిపాలన కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. శనివారం పట్టణంలోని 15వ వార్డు పరిధిలోని మోణింగి వారి వీధి, పాతినవారి వీధుల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనపై ప్రజల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ తమ్మినేని గీత, పిఎసిఎస్ శిమ్మ మాధవి, మొదలవలస రమేష్, పివివి ప్రసాద్, మురళీధర్ యాదవ్, పాతిన రమ ణమూర్తి, అన్నెపు సత్యం, అమ్మినాయుడు పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని సానివాడ, పప్పంగి గ్రామాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌ఛార్జిలు, క్లస్టర్ ఇన్‌ఛార్జిలు, బూత్ ఇన్‌ఛార్జిలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు పేరిట మండలంలోని మెళియాపుట్టిలో నిర్వహించారు. టిడిపి మాజీ మండల అధ్యక్షులు అనపాన రాజశేఖరరెడ్డి ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఏడాది పొడవునా ప్రభుత్వం చేసిన మంచి పనులను ప్రజలకు వివరించారు. ఇంకా ఏం అవసరాలున్నాయని ఆరా తీశారు. కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ ఒట్టు కోళ్ల చక్రి, శంకర్‌రెడ్డి పాల్గొన్నారు.

శ్రీకాకుళం రూరల్ : ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

ప్రకృతి వ్యవసాయంతో మెరుగైన ఫలితాలు

విత్తనాలు అందిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి- కవిటి

ప్రకృతి వ్యవసాయం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని ఎపిఎం గోవిందరావు, ఐసిఆర్‌పిలు స్వాతి, సంతోషి అన్నారు. కవిటిలో రైతు ఉత్పత్తిదారుల సంస్థ సమావేశంలో పాల్గొన్న వీరు ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటిఎం మోడల్‌తో సేంద్రీయ సాగు ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని సూచించారు. ఈ పద్ధతిలో అనువైన రీతిలో బెడ్లు, మధ్యలో నీటి కాలువలతో ఆకర్షణీయంగా రూపొందించి ఘన జీవామృతం, భీజామృతం వాడి 18 రకాల కూరగాయల విత్తనాలు నాటుకోవాలని సూచించారు. వాటిలో ముల్లంగి, గోంగూర, క్యారెట్, బీట్రూట్, బెండ, గోరుచిక్కుడు, బీర, మొక్కజొన్న లాంటి పంటలతో భూమిలో సూక్ష్మపోషకాలు, సూక్ష్మజీవులు పెరుగుతాయని, భూమి ఏడాది పొడవునా పచ్చగా ఉండి సేంద్రీయ కర్బనం పెరుగుతుందని తెలిపారు. అనంతరం రైతులకు రాయితీపై కూరగాయల విత్తనాలు అందించారు. కార్యక్రమంలో సిసి రామకృష్ణ, రైతు ఉత్పత్తిదారుల సంస్థ సభ్యులు గొండ్యాల రవి, బల్లెడ శంకరరావు, బల్లెడ జయప్రకాష్, బొర్ర కీర్తిరావు, దున్న రంగారావు, పండి విజయకుమార్, శమల్ల సర్వేశ్వరరావు, పి.కాళేశ్వరరావు, సిబ్బంది భాగ్యలక్ష్మి, గీత, సంతోష్ పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపే లక్ష్యం

ప్రజాశక్తి- కవిటి

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని ఎంఇఒ ధనుంజయ మజ్జి, బొరివంక క్లస్టర్ కాంప్లెక్స్ చైర్మన్ ఎస్.రామకృష్ణ సూచించారు. బొరివంక కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ విద్యా ప్రమాణాలు మెరుగుపరచడం, విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచడం లక్ష్యంగా ఉపాధ్యాయులు పనిచేయాలని సూచించారు. వంద శాతం హాజరు సాధన, టీచర్ హ్యాండ్ బుక్ రివ్యూ, పరీక్షా విధానాలపై సమావేశంలో చర్చించారు. అలాగే ఉపాధ్యాయులు, విద్యార్థుల ఉపాధి ప్రమాణాల పెంపు కోసం అనుసరించాల్సిన ఉత్తమ పద్ధతులపై చర్చించారు.

మెళియాపుట్టి: మండలంలోని పెద్దపద్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల క్లస్టర్ కాంప్లెక్స్ సమావేశాన్ని నిర్వహించారు. వమరవల్లి డైట్ అబ్జర్వర్ వి.శరత్‌బాబు సందర్శించారు. కార్యక్రమంలో ఎంఇఒ ఎస్.దేవేందరరావు, క్లస్టర్ హెచ్ఎం పి.రామారావు, హెచ్ఎంలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రామకృష్ణ

విద్యార్థిని సన్మానిస్తున్న రామరాజు

విద్యార్థికి సన్మానం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని పెద్దపద్మాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పడాల రామారావు అధ్యక్షతన పాతపట్నానికి చెందిన రామరాజు ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షులు, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత పారశెల్లి రామరాజు ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం శనివారం నిర్వహించారు. 2024-25లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలో కొత్తపల్లి శ్యామసుందరరావు 587/600 మార్కులు సాధించి, నూజివీడులో ట్రిపుల్ ఐటిలో సీటు సంపాదించారు. ఈ సందర్భంగా రామరాజు అభినందన, నగదు పురస్కారం ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా మాలతి శ్రీధర్, లింగాల సంజీవరావు, ఎన్ని లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

రైల్వే అండర్ పాసేజ్‌లో ఏర్పడిన గుంతలు

అండర్ పాసేజ్‌లో గుంతలతో ఇబ్బందులు

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని బొడ్డేపల్లి రైల్వే అండర్ పాసేజ్‌లో భారీగా గుంతలు ఏర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తే చాలు నీరు నిల్వ ఉండడంతో ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. ఏడాది క్రితం వేసిన కాంక్రీట్ సిమెంటు నాణ్యత లేని కారణంగా రాళ్ల తేలి గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అండర్ పాసేజ్‌లో ఏర్పడిన గుంతలను పూడ్చేందుకు రైల్వే అధికారులు చర్యలు తీసుకోవాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శ్యామ్ మృతికి సంతాపం

ప్రజాశక్తి- కవిటి

మండలంలోని జగతి పంచాయతీ చిన్నమెలియాపుట్టుగకు చెందిన వైసిపి కార్యకర్త ఎర్ర శ్యామ్ ఆకస్మిక మృతిపై పలువురు నాయకులు, కార్యకర్తలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శనివారం సాయంత్రం గ్రామానికి వెళ్లిన కవిటి మండల వైసిపి అధ్యక్షుడు కడియాల ప్రకాష్, వైస్ ఎంపిపి పూడి నేతాజీ, ఎంపిటిసి పూడి నీలాచలం, జగతి వైస్ సర్పంచ్ బోసు, సహాలాలపుట్టుగ సర్పంచ్ ప్రతినిధి రవి, ఎంపిటిసి ప్రతినిధి మురళి తదితరులు ఎర్ర శ్యామ్ కుటుంనానికి తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ కోసం శ్యామ్ అందించిన సేవలను గుర్తుచేసుకున్నారు.